## క్లుప్తంగా

### అభ్యసన సామర్థ్యం పెంపుదలకు కృషి

గన్నవరం రూరల్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపుదలకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు బీబీగూడెం మెయిన్ పాఠశాల హెచ్ఎం వేమూరి లక్ష్మీ పేర్కొన్నారు. పాఠశాలలో శనివారం టీచ్ టూల్ కార్యక్రమం జరిగింది. మూడో తరగతి విద్యార్థులకు ఉగాది పండగ పాఠాన్ని ఉపాధ్యాయురాలు ఎం.మేరీ బోధించారు. సీఆర్పీ కాండ్రు మోహనరావు పాల్గొన్నారు.

### ప్రత్యేక పూజలు

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న విజయరాజరాజేశ్వరి సమేత శ్రీ విజయసుందరేశ్వరస్వామి ఆలయంలో సప్తమ వార్షికోత్సవం సందర్భంగా రెండో రోజు శనివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గోపూజ, శ్రీమహాగణపతి పూజ, స్పటిక లింగానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మృత్యుంజయ హోమం చేశారు. 300 మంది మహిళలు సత్యనారాయణస్వామి వ్రతం చేశారు. భక్తులు శ్రీవాసుదేవానందగిరిస్వామి ఆశీస్సులు ఇచ్చారు. కాగా ఆదివారం 108 మంది దంపతులతో మహాచండీయాగం, రథోత్సవం, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

### ల్యాప్‌టాప్ వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలతో పాటుగా దాతలు అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు అన్నారు. బాపులపాడు మండలం వేలేరులోని జెడ్పీ హైస్కూల్‌కు దాత దోనవల్లి గంగాధరరావు (గాంధీ) రూ.50 వేల వ్యయంతో ల్యాప్‌టాప్‌ను ల్యాప్‌టాప్‌ను ఆవిర్నేని శేషగిరిరావు చేతుల మీదుగా హెచ్ఎం కొమ్మా విజయ్‌కు శనివారం అందజేశారు. సర్పంచ్ సుదిమెళ్ల సుందరమ్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దోనవల్లి సూరిబాబు పాల్గొన్నారు.

### వరకట్న వేధింపుల కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న ఓ వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు తాడిగడప వసంతనగర్‌కు చెందిన మాతంగి మోనాలిక గత 2018 సంవత్సరంలో రాజేష్ పరస్పరం ప్రేమించుకుని ప్రేమ వివాహం చేసుకున్నారు. రాజేష్ కారు డ్రైవర్‌గా పని చేస్తాడు. వీరికి పాప పుట్టింది. అయితే రాజేష్ దురలవాట్లకు బానిసగా మారాడు. ఈ క్రమంలో వివాహం జరిగిన సమయంలో కట్నకానుకలు ఇవ్వలేదని, తనకు కట్నం కావాలని భార్య మోనాలికను వేధించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు రాజేష్‌పై కేసు నమోదు చేశారు.

### టీకా వేయించండి

హనుమాన్‌జంక్షన్ రూరల్: తట్టు వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి చిన్నారికీ తప్పనిసరిగా టీకా వేయించాలని బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.జె.మంజూష అన్నారు. తట్టు (పొంగు) వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో వైద్యారోగ్య శాఖ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్‌ను శనివారం నిర్వహించారు. 10 నెలల లోపు చిన్నారులకు తట్టు వ్యాధి టీకాను ఏఎన్ఎంలు వేశారు. కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ అధికారి బి.సాంబశివారెడ్డి పరిశీలించారు. సీహెచ్‌వో ఫణికుమార్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

**చిన్నారులకు పొంగు నిరోధక వ్యాక్సిన్**

గన్నవరం రూరల్: చిన్నారుల్లో పొంగు నివారణకు ప్రభుత్వ చర్యలు తీసుకుంటున్నట్లు డీఎం అండ్‌హెచ్ఓ కార్యాలయం హెచ్ఈఈఓ బి.శివసాంబిరెడ్డి పేర్కొన్నారు. సూరంపల్లిలో మండల వైద్యాధికారి డాక్టర్ జి.సంధ్య ఆధ్వర్యంలో 16 నెలల నుంచి 24నెలలలోపు చిన్నారులకు వేస్తున్న పొంగు నిరోధక వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు.

### ఎమ్మెల్యే వంశీ చొరవతో వీధి దీపాల ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్ రూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను సత్వరంగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు బాపులపాడు సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. స్థానిక హనుమాన్‌నగర్‌లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు శనివారం చర్యలు చేపట్టారు. హనుమాన్‌నగర్‌లోని వీధిలో కొత్తగా స్తంభాలతోపాటు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఈ పనులను సర్పంచ్ కమలభాయి, కార్యదర్శి ప్రసాద్ పర్యవేక్షించారు.

### అవార్డు గ్రహీతకు సన్మానం

ఉయ్యూరు: ఆయుర్వేద వైద్యంతో చిన్మయ పేదలకు చేస్తున్న సేవలు అభినందనీయమని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ జంపాన శ్రీనివాసగౌడ్ అన్నారు. ఉయ్యూరుకు చెందిన ఆయుర్వేద వైద్యులు డాక్టర్ దీవి చిన్మయకు చెన్నైకు చెందిన ఆయుర్వేద సంస్థ వైద్యవంశ విభూషణ్ అవార్డును ప్రకటించింది. చెన్నైలో ఈ నెల 24న జరిగిన సమావేశంలో అవార్డు అందుకుని వచ్చిన డాక్టర్ చిన్మయను శనివారం సహచట్టం కార్యకర్తలు కలిసి సత్కరించారు. శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ ఆయుర్వేద రత్న గోపాలచార్యులు జయంతి సందర్భంగా తాను అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. జగదీష్, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

# అతి వేగంతోనే రోడ్డు ప్రమాదాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారి ఆరులైన్లుగా విస్తరించినప్పటికీ రోడ్డు ప్రమాదాల మాత్రం తగ్గడంలేదు. అతి వేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, మద్యం తాగి వాహనాలను నడపటమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. రోడ్డు భద్రతపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు చైతన్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నా ప్రమాదాల సంఖ్య తగ్గటం లేదు.

**ప్రమాదాలకు కారణాలెన్నో..**

16వ నంబర్ జాతీయ రహదారి గన్నవరం నుంచి హనుమాన్‌జంక్షన్ వరకు డేంజర్ స్పాట్‌గా మారింది. మితిమీరిన వేగం, మద్యం మత్తు, తెల్లవారుజామున నిద్ర మత్తు, డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రధానంగా రోడ్డు ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి. అతివేగంతో నడుస్తున్న వాహనాలు ప్రయాణికుల పాలిట మృత్యుశకటాలుగా మారుతున్నాయి. రోడ్డు పక్కన నడుస్తున్న వారు, రహదారి దాటుతున్న వ్యక్తులు కూడా వాహన చోదకుల నిర్లక్ష్యపూరిత వైఖరితో మృత్యువాత పడుతున్నారు.

**వరుస ప్రమాదాలతో బెంబేలు..**

గడిచిన మూడు నెలల్లో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి.

- తాజాగా హనుమాన్‌జంక్షన్ శివారులోని వేలేరు క్రాస్‌రోడ్డు వద్ద పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన 25 మంది కూలీలతో వెళుతున్న మినీ బొలెరో వ్యాన్‌లో పల్టీ కొట్టిన ఘటన చోటు చేసుకుంది. తెల్లవారుజాము నిద్రమత్తులో డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపటంతో డివైడర్‌ను ఢీకొని అవతలి వైపు రహదారిపైకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరు కూలీలు దుర్మరణం చెందారు. మిగిలిన వారంతా గాయాలపాలయ్యారు.
- ఈ నెల 3వ తేదీన ఇదే స్పాట్‌లో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో పాదచారుడు శరీరం మొత్తం నుజ్జు అయింది. కనీసం మృతుడిని గుర్తించేందుకు అవకాశం లేకుండా పోయింది.
- వీరవల్లి సమీపంలోని కోమటిగుంట రోడ్డు వద్ద కూడా ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. మూడు రోజులు క్రితం కోమటిగుంట రోడ్డు వద్ద ఆరుగురు ప్రయాణికులతో వెళ్తున్న మినీ వ్యాన్ అదుపు తప్పి పల్టీ కొట్టిన ఘటన చోటు చేసుకుంది. అంతేగాకుండా పలుమార్లు హైవేపై వాహనాలు డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల బోల్తా కొట్టి ప్రమాదాలకు గురైన సంఘటనలున్నాయి. అంపాపురం వద్ద డివైడర్‌ను ఢీకొనడం, బొమ్ములూరు టోల్‌గేట్ వద్ద ఆగిఉన్న లారీలను ఢీకొని ప్రమాదాలకు గురికావడం అధికంగా జరుగుతున్నాయి.



తేలనరసన్నపాలెం వద్ద రోడ్డు ప్రమాదంలో లారీలో ఇరుక్కున్న కారు (ఫైల్)

**రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు**

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. తరచూ హైవేపై వాహన తనిఖీ నిర్వహించి, అతి వేగంగా నడుపుతున్న, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు జరిమానా విధిస్తున్నాం. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేస్తున్నాం.

– అల్లు నవీన్ నరసింహమూర్తి, హనుమాన్‌జంక్షన్ సీఐ

**అధికారిక లెక్కలు ఇలా..**

16వ నంబర్ జాతీయ రహదారిపై హనుమాన్‌జంక్షన్ పోలీస్ సర్కిల్ పరిధిలోని బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లో రికార్డుల ప్రకారం గతేడాది 85 యాక్సిడెంట్లు జరగ్గా, 42 మంది మృతి చెందారు. ఈ ప్రమాదాల్లో మరో 59 మంది క్షతగాత్రులయ్యారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో 18 యాక్సిడెంట్లు జరిగాయి. ఈ ఘటనల్లో 10 మంది దుర్మరణం చెందారు. మరో 11 మంది క్షతగాత్రులయ్యారని పోలీసు లెక్కల్లో నమోదయ్యాయి. ఇవి కాకుండా లెక్కకు మించిన ఘటనల్లో నిత్యం హైవేపై ఎంతోమంది గాయాలపాలవుతున్నారు.

## పరిపాలన సౌలభ్యం కోసం వీఆర్వోలకు బాధ్యతలు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో పరిపాలన స్వౌలభ్యం కోసం తహసీల్దార్ పి.జాహ్నవి గ్రామస్థాయి రెవెన్యూ అధికారుల(వీఆర్వోఓ)లకు సర్వే నంబర్ల ప్రకారం పని విభజన చేశారు. ఇప్పటి వరకు గ్రామాల్లోని వీఆర్వోలు సర్వే నంబర్ల ప్రకారం విభజన లేక పోవడంతో కొందరు ఆధిపత్యం చేశారు. పని విభజన నేపథ్యంలో ఎవరికి అప్పగించిన సర్వే నంబర్లలో వారు మాత్రమే విధులను నిర్వహిస్తూ, వారి పరిధిలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే విధంగా బాధ్యతలను తహసీల్దారు అప్పగించారు. గ్రేడ్‌ల ప్రకారం రెవెన్యూకు సంబంధించిన విధులను విభజించారు. అంబాపురం గ్రామం గ్రేడ్ వన్ పి.శ్రీనివాసరావు(1), ఎనికేపాడు గ్రామంలో గ్రేడ్ వన్, పి.పవన్‌కుమార్,(1) గ్రేడ్ 2 డి.ఉమామహేశ్వరావు(2), గొల్లపూడిలో ముగ్గురు గ్రేడ్-1 వీఆర్వోలు బి.వినోద్ రాజు(1), కె.రమేష్ నాయుడు(2), జీసీ శేఖర్‌శర్మ(3),గ్రేడ్ 2లో ఎ.భాను శివ తేజ,(4),డి.నానికుమార్(5), గూడవల్లి గ్రేడ్‌వన్ డి.అరుణకుమారి(1), గ్రేడ్-2 జె.కిరణ్‌కుమార్(2), జక్కంపూడి, షాబాద గ్రేడ్2 కె.లక్ష్మీ(1), ఎం.శివయ్య(2),పి.గోపీచంద్(3), కేవీ కండ్రిక, గ్రేడ్ వన్ ఎం.లీలాకృష్ణ, గ్రేడ్-2 ఎం.రజని కుమారి(2), తాడేపల్లి, కొత్తూరు, వేమవరం గ్రామాలకు గ్రేడ్ వన్ బి.శ్రీనివాసరావు(1), నిడమానూరు వి.శ్రీనివాసరావు(1), ఎం.అరుణ(2), వి.శ్రీనివాసరావు(3), నున్న గ్రామానికి బి.శ్రీనివాసరావు,(1), టి.శంకర్(2), షేక్ చాంద్(3), పాతపాడు గ్రామానికి పి.రఘుబాబు(1), పి.నైనవరం(పాతపాడు) పి.బసవయ్య(2), ప్రసాదంపాడు ఎంపీఎస్ చక్రధర్‌రావు (1), జి.దుర్గరావు (2), అబ్దుల్ రిజ్వాన్‌బేగమ్(3), రామవరప్పాడులో ఎస్‌వీ రాధాకృష్ణ(1), సుభాని బాషా(2), సీహెచ్ రమాదేవి(3), షేక్ షహీన(4), కె.లక్ష్మీతులశమ్మ(5), రాయనపాడు గ్రామానికి ఎం.నాగేంద్ర బాబు(1), రాయనపాడు (పైడూరుపాడు)ఎస్.ఎన్ సత్యవతి(2)కు సర్వే నంబర్లను కేటాయించారు. ఆ ప్రకారం నేటి నుంచి అమలులో ఉంటాయని తహసీల్దారు తెలియజేశారు.

## మానవత ప్రతిభా పురస్కారం అందజేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సాహించేందుకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతి నెలా ప్రతిభా పురస్కారాలను పంపిణీ చేస్తుందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో మానవత ప్రతిభా పురస్కారోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ప్రముఖ బహుళజాతి కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించిన తిమ్మనవీడుకు చెందిన కనిగంటి యామినికి ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. ఈ అవార్డు కింద రూ. 25 వేలతో పాటుగా ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందించారు. యామినితో పాటుగా ఆమె తల్లిదండ్రులను మానవత సభ్యులు ఘనంగా సత్కరించారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు చక్కా సుబ్బారావు, బెజవాడ శ్రీరామ్మూర్తి, సీనియర్ సభ్యులు నారగాని కొండలరావు, డాక్టర్ నిడమర్తి లలితా కామేశ్వరి, ఘంటా సత్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు, గూడపాటి జయరామచంద్రరావు, దయాల ప్రభాకరరావు పాల్గొన్నారు.

## దేవస్థానం భూముల పరిశీలన

పాతపాడు(విజయవాడరూరల్): భూముల రీసర్వేలో భాగంగా జరుగుతున్న భూముల పరిశీలన కార్యక్రమం శనివారం పాతపాడు గ్రామంలో జరిగింది. నున్న గ్రామంలో వేంచేసియున్న కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 8ఎకరాల 74 సెంట్ల వ్యవసాయ భూములు పాతపాడు సర్వే నంబరు 346లో ఉన్నాయి. రికార్డులు పరిశీలించిన పిమ్మట గ్రామ రెవెన్యూ అధికారి పి.రఘుబాబు, దేవస్థానానికి చెందిన జూనియర్ అసిస్టెంట్ వెంకట సుబ్బారావు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వీఆర్వో రఘుబాబు మాట్లాడుతూ గ్రామంలో భూముల క్రయ, విక్రయాలు జరిగిన నేపథ్యంలో సర్వే నంబర్ల సబ్‌డివిజన్లు జరిగి ఉంటాయి కావున రైతులు తమ భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు పరిశీలనార్థం చూపించాలని విజ్ఞప్తి చేశారు. ఏదైనా మార్పులు, చేర్పులుంటే వాటిని సరిచేసుకునే వీలుంటుందని పేర్కొన్నారు.



పాతపాడులో దేవుని మాన్యాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు

## 2వ తేదీ నుంచి యోగా తరగతులు

గన్నవరం: స్థానిక బుద్ధవరం రోడ్డులోని ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో మార్చి 2వ తేదీ నుంచి యోగా తరగతులు ప్రారంభిస్తున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మదువల్లి బాలకృష్ణమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. యోగా గురువు శ్రీధారణ నేతృత్వంలో 108 రోజులు పాటు ఈ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. రోజూ ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు మొదటి బ్యాచ్, ఉదయం 9 నుంచి 10.15 వరకు రెండో బ్యాచ్ తరగతులు జరుగుతాయని తెలిపారు. ఈ యోగా తరగతులకు హాజరయ్యేందుకు ఆసక్తి కలిగిన వారు 93478 88889కు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## పట్టా భూముల కోసం గ్రామ సభ

నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉన్న రైతులకు చెందిన పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు శనివారం నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ జరిగింది. గ్రామానికి చెందిన బొంతు సీతారావమ్మకు చెందిన ఆర్ఎస్ నంబర్ 531/2లో 96 సెంట్లు భూమి, డాక్టర్ బొట్ల మాధవరెడ్డికి చెందిన ఆర్ఎస్ నంబర్ 382/3లో ఎకరం 45సెంట్లు భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయి. యజమానులు ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు గ్రామ సభ నిర్వహించి అభ్యంతరాలుంటే తెలియజేయమని గ్రామ సభ తీర్మానం చేసింది. సర్పంచ్ కాటూరి సరళ, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ పాల్గొన్నారు.

## రంగుల తయారీపై మహిళలకు శిక్షణ

గన్నవరం రూరల్: ఎకో ఫ్రెండ్లీ హోలీ కలర్స్ ఇళ్ల వద్దనే తయారు చేసుకునేందుకు సూరంపల్లి మహిళా పారిశ్రామికవాడలో ఐదు రోజుల పాటు జరిగిన శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. కెనరా బ్యాంకు, ఎలీప్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ పోలవరపు శోభారాణి మాట్లాడుతూ బంతి, మోదుగా, వేప, మామిడి, నీలగిరి, దానిమ్మ, టేకు, జామ, గంట గరగరాకు, గోరింట చెట్ల నుండి ఆకులు, పూలు సేకరించి హోలీ కలర్‌లు తయారు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రకృతి నుంచి సహజ సిద్ధంగా లభించే పూలు, కాయలు, ఆకులు, కొమ్మలు నుంచి రంగులను తయారు చేయటం నేర్పించినట్లు తెలిపారు. పరిశ్రమలు నెలకొల్పే మహిళలకు యూనిట్ల స్థాపన, నిర్వహణ, బ్యాంకు లోన్లు తదితరాలపై అవగాహన కల్పించారు.



శిక్షణలో పాల్గొన్న మహిళలతో ఎలీప్ ప్రతినిధి శోభారాణి

## అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

హనుమాన్‌జంక్షన్ రూరల్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు బాపులపాడు సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. స్థానిక హనుమాన్‌నగర్‌లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ప్రజలు విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు శనివారం చర్యలు చేపట్టారు. హనుమాన్‌నగర్‌లోని వీధిలో కొత్తగా స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఈ పనులను సర్పంచ్ కమలబాయి, కార్యదర్శి ప్రసాద్ పర్యవేక్షించారు. వెంటనే స్పందించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## ఉగాదినాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

ఉంగుటూరు: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు ఉగాది నాటికి పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు, హౌసింగ్ ఏఈ సురేష్‌లు సూచించారు. మండలంలోని పెద అవుటపల్లి గ్రామ సచివాలయంలో జగనన్న కాలనీ లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇల్లు నిర్మాణం చేపట్టే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు అవుతున్నాయని చెప్పారు. ఆర్థికంగా ఇబ్బంది పడేవారికి ప్రభుత్వం రుణ సౌకర్యం కల్పించిందన్నారు. ప్రభుత్వ అందిస్తున్న తోడ్పాటును ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకునే విధంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి సరోజిని, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## అరుణాచలం యాత్ర ప్రత్యేక బస్ సర్వీసులు

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం యాత్రా స్పెషల్ మార్చి 5వ తేదీ నుంచి ప్రత్యేక బస్ సర్వీసులు నడపనున్నట్లు డీఎం పి.శివాజీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... ఈ యాత్రా స్పెషల్‌లో భాగంగా శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలంకు ఈ సర్వీస్ నడపనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు మార్చి 5వ, ఏప్రిల్ 4వ, మే 3వ, జూన్ 2వ తేదీల్లో రాత్రి 7 గంటలకు గన్నవరం నుంచి బయలుదేరి మూడు రోజుల ప్రయాణం తర్వాత ఉదయం ఏడు గంటలకు తిరిగి ఇక్కడికి చేరుకుంటుందని తెలిపారు. అరుణాచలం యాత్రకు వెళ్లే ప్రయాణికుల టిక్కెట్ ధరను రూ. 2,700గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సర్వీస్ టిక్కెట్లను స్థానిక బస్‌స్టేషన్‌లోగాని, ఆన్‌లైన్‌గానీ, అథరైజ్డ్ ఏజెంట్ల వద్ద బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర సమాచారం కోసం 73828 96090, 73829 05633లో సంప్రదించాలని కోరారు.

# విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: రాష్ట్రంలో విద్య–వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, బడ్జెట్‌లో సంమృద్ధిగా నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. యనమలకుదురు గ్రామంలో వెలగపూడి ట్రస్టు ఆధ్వర్యంలో దాత వెలగపూడి రాజ్‌కుమార్ సహకారంతో రూ.3 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మి ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. నాడు–నేడు పథకం కింద రాష్ట్రంలో రూ.16 వేల కోట్లతో ఆస్పత్రులు అభివృద్ధి చేసి వసతులు సమకూర్చారన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 7,548 ఆరోగ్య కేంద్రాలు ఉండగా టీడీపీ గత ఐదేళ్ల పాలనలో ఒక్క ఆరోగ్య కేంద్రం కూడా నిర్మాణం చేయలేదన్నారు. తమ ప్రభుత్వం మూడున్నర సంవత్సరాలలో అదనంగా 2,700 ఆరోగ్య కేంద్రాలు నిర్మించినట్లు పేర్కొన్నారు. టీడీపీ హయాంలో ఇంజనీరింగ్‌కాలేజీల్లో ఫీజులకు పూర్తి రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా కేవలం రూ.35 వేలు మాత్రమే ఇచ్చిందన్నారు. తమ ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తోందన్నారు. ప్రతిఒక్కరూ చదువుకుని, ఆరోగ్యవంతంగా ఉంటేనే మానవ వనరుల అభివృద్ధి జరుగుతుందన్నారు.

**యనమలకుదురు అభివృద్ధికి కట్టుబడి ఉన్నా**

యనమలకుదురు గ్రామం అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. యనమలకుదురు గ్రామంలో వివిధ పథకాల కింద రూ.198 కోట్లు లబ్ధిదారులకు ఇచ్చామని, ఇళ్ల స్థలాలు 3,257 మందికి మంజూరు చేశామని తెలిపారు. అభివృద్ధి పనులు రూ.10 కోట్లతో చేశామన్నారు. యనమలకుదురులో రూ.6 కోట్లతో మరో కొత్త వంతెన నిర్మాణం చేపడతామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న యనమలకుదురు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కోర్టుకు వెళ్లారని, కోర్టు ఉత్తర్వులు రాగానే వంతెన పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు నంగా నరసింహారావు, దాత వెలగపూడి రాజ్‌కుమార్, తాడిగడప కమిషనర్ ఎన్.ప్రకాశరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, వైద్యాధికారి రవికుమార్, వైఎస్సార్ సీపీ నేతలు వెలగపూడి వరప్రసాద్, వెలగపూడినాగభూషణం, హక్, యార్లగడ్డ వీరబాబు, గుమ్మడి విజయ్‌కుమార్, మరీదు శ్రీనివాసరావు, కోసూరి నరేష్‌కుమార్, బబ్లూ, మాదురమేష్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

## ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు

మంతెనలో ఈనాడు ప్రతులు దగ్ధం

కంకిపాడు: ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తూ అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ శ్రేణులు స్పష్టంచేశారు. ప్రభుత్వంపై విషం చిమ్ముతూ ఈనాడులో ప్రచురితమవుతున్న అసత్య కథనాలను నిరసిస్తూ మండలంలోని మంతెన బోసు బొమ్మ సెంటరులో శనివారం ఈనాడు ప్రతులను పార్టీ శ్రేణులు దహనం చేసి నిరసన వ్యక్తం చేశాయి. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండపేటి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ పదే పదే అసత్యాలను ప్రచారం చేస్తూ అదే నిజం అని నమ్మించేలా పచ్చ పత్రికలు కంకణం కట్టుకుని టీడీపీకి బానిసలుగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. చంద్రబాబు లోపాలను సరిచేస్తూ దిగజారుడు రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నాయని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం లక్ష్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలే కాకుండా అగ్రకులాల్లోని పేదలకు సైతం ఫలాలు అందిస్తుంటే చూసి ఓర్వలేక, అధికారమే లక్ష్యంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ నాయకులు బంద్రపల్లి గగన్, వీరంకి రాంబాబు, కొండేటి అర్జున్, ప్రత్తిపాటి రాంబాబు, కోటా మధు, పెనుమాక సుబ్బయ్య పాల్గొన్నారు.



మంతెన గ్రామంలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న నాయికులు

## సందడిగా ఎఫోసెక్-2023



పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో ఎఫోసెక్-2023 సందడిగా జరిగింది. జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో ముగింపు రోజు శనివారం ఆహ్లాదకరమైన వాతావరణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాలు డ్యాన్స్ పోటీల్లో పాల్గొని సందడి చేశారు. పాటలు, నృత్యం, గ్రూప్ డ్యాన్స్, స్పాట్ ఫోటోగ్రాఫీ, పెయింటింగ్, వాయుద్య సంగీతం, తెలుగు సృజనాత్మక రచనలు, వివిధ రకాల పోటీలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా దాదాపు రెండు వేల మంది విద్యార్థులు పాల్గొని సత్తాచాటారు. విజేతలకు నగదు బహుమతి ఇచ్చారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు చదలవాడ నాగేశ్వరరావు, కాలేజ్ కన్వీనర్ మలినేని రాజయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, డీన్ పాండురంగారావు, ఎఫోసెక్ కన్వీనర్‌లు డాక్టర్ వీఆర్ఎల్ నరసింహం, శ్రీదేవి పాల్గొన్నారు.

## నేడు రక్తదాన శిబిరం

పెనమలూరు: కానూరులో డాక్టర్ పిన్నమనేని సుధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవాసంఘ కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు. ఆయన శనివారం వివరాలు తెలియజేశారు. ఆదివారం కానూరు కార్మెల్ చర్చిలో ఫాదర్ ఎం.బాలస్వామి, డాక్టర్ జాస్మిన్‌సుల్తాన్ ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

## వేసవిలో తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

ఉయ్యూరు: వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) సూచించారు. స్థానిక కౌన్సిల్ హాలులో సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండాలోని అంశాలపై సమీక్ష జరిపారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు అంశాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చైర్మన్ వల్లభనేని నాని మాట్లాడుతూ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడమే ప్రథమ కర్తవ్యంగా పనిచేయాలన్నారు. మున్సిపాలిటీలో ప్రజలపై భారాలు పడకుండా ఆదాయాన్ని పెంచి అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత పంచాయతీ హయాంలో నాన్ లే అవుట్లపై విజిలెన్స్ అధికారులు విధించిన రూ 7.50 కోట్ల పైగా వసూళ్లపై చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే రూ 5.50 కోట్లు వసూళ్లు చేసి, ఖజానాకు జమ చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. మిగిలిన మొత్తాన్ని వసూలు చేసేందుకు అధికారులు బాధ్యతతో పనిచేయాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సూచనలు ఇస్తున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని

## కేడీసీసీబీ పథకాలపై ప్రచారం

హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ద్వారా రైతులకు అందిస్తున్న పథకాలు, రుణ సదుపాయాలపై అవగాహన కల్పించేందుకు బాపులపాడు మండలంలోని వేలేరు పీఏసీఎస్ ప్రాంగణంలో శనివారం కళాజాత నిర్వహించారు. కేడీసీసీబీ అమలు చేస్తున్న వ్యవసాయ రుణాల పథకాలు, ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన, సురక్ష భీమా యోజన, నగదు రహిత లావాదేవీలు, సైబర్ నేరాలు, రుణ సదుపాయాల గూర్చి కళా భారతి (బిళ్లపాడు) బృందం కళాకారులు పాటలు, నాటికల ద్వారా ప్రచారం చేశారు. కళాకారులు ఎం.శేఖర్ బాబు, తిరుపతి కుమార్, వి.రమేష్, వై. వీరయ్య పాల్గొన్నారు.

**సవరణ**

[illegible]

**ట్రాక్టరు ట్రక్కు బోల్తా**

ఉయ్యూరు: ఉయ్యూరు ప్రధాన సెంటర్లో డివైడరును ఢీకొని ట్రాక్టరు ట్రక్కు బోల్తా పడ్డ సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఉయ్యూరు గాయత్రీ ఎలక్ట్రికల్ షాపు ఎదురుగా డివైడరును ఢీకొని ట్రాక్టరు బోల్తా పడింది. ట్రాక్టరు ట్రక్కు బోల్తా పడటంతో ఇరువురు గాయపడ్డారు. రెండు బైక్‌లు ధ్వంసం అయ్యాయి. క్షతగాత్రులను వైద్యం నిమిత్తం తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు.